ఈనాడు నంద్యాల
శనివారం అక్టోబరు 5, 2024

బ్రహ్మచారిణిగా భ్రమరాంబ

■ మయూర వాహనంపై మల్లన్న ■ శ్రీగిరిలో దసరా మహోత్సవాలు



స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకెళ్తున్న ఈవో డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు



ఆకట్టుకున్న కళాకారిణుల నృత్యం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ఇలకైలాసంలో దసరా మహోత్సవాల సందడి మిన్నంటింది... భ్రమరాంబాదేవి రెండో రోజు బ్రహ్మచారిణిగా కొలువుదీరి పూజలందుకున్నారు. అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను శోభాయమానంగా ముస్తాబు చేసి మయూర వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం అర్చకులు రుద్ర మంత్రాలతో, ధూపదీప హారతులు సమర్పించి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులు గ్రామోత్సవానికి తరలిరాగా, ఈవో డి. పెద్దిరాజు నారికేళాలు సమర్పించారు. పరివార దేవతామూర్తుల హారతులు అందుకొని స్వామిఅమ్మవార్లు గ్రామోత్సవానికి పురవీధుల్లోకి చేరుకున్నారు. కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు

దసరా మహోత్సవాల మూడో రోజు భ్రమరాంబాదేవి భక్తులకు చంద్రఘంట అలంకారణలో శనివారం దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లకు రావణ వాహన సేవ జరగనుంది. దక్షిణ మాడవీధిలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

పేదల దుక్కి..

■ వైకాపా హయాంలో ఫ్రీహోల్డ్ మాయాజాలం
■ పరిశీలనలో వెలుగు చూస్తున్న అక్రమాలు
■ ఈ నెల 7 నాటికి విచారణ పూర్తి


పెద్దలకు దక్కి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ హయాంలో పేదల దుక్కిలో పెద్దలు పాగా వేశారు.. అధికారులను మచ్చిక చేసుకొని పేదల భూములు సొంత చేసుకొన్నారు. 2003 సంవత్సరానికి ముందు పేదలకు అందజేసిన భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాని మాటున వేలాది ఎకరాలు సొంత చేసుకొన్నారు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణకు ఆదేశించింది. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేకాధికారిగా సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, ప్రత్యేక ఉప కలెక్టర్లను నియమించారు. ప్రస్తుతం నియోజకవర్గ ప్రత్యేకాధికారుల వద్ద దస్త్రాల పరిశీలన సాగుతోంది. కోడుమూరు మండలం గోరంట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో నాలుగు సర్వే నంబర్లలో 12 ఎకరాల ప్రభుత్వ భూములను గత వైకాపా ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేశారు. ఆ భూములను ప్రత్యేక ఉప కలెక్టర్ నిశితంగా పరిశీలించగా అసైన్‌మెంట్ కమిటీ రిజిస్టర్ లేదు. డీకేటీ పట్టాలు లేకుండా ఫ్రీహోల్డ్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఎలాంటి ఆధారాలు లేకుండా భూయాజమాన్య హక్కులు కల్పించినట్లు కేఆర్ ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పరిశీలనలో తేలింది. దీంతో ఆమె ఈ దస్త్రాన్ని తిరస్కరించారు. ఇలా విచారణలో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈనెల 7వ తేదీ నాటికి ఈ ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేయాలని సీసీఎల్‌ఏ నుంచి ఆదేశాలు అందాయి.

క్షేత్రస్థాయికి వెళ్లకుండానే పరిశీలన

ఎసైన్‌మెంట్, ఇనామ్ భూముల పరిశీలనను సెప్టెంబరుకు పూర్తి చేయాలని సీసీఎల్‌ఏ ఇదివరకే ఆదేశించింది. ఆ గడువును మరోమారు పొడిగించింది. గ్రామ, మండల స్థాయి రెవెన్యూ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రొఫార్మా-ఎ, బి, సి, డి కింద ఎసైన్డ్, డి.నోటిఫైడ్, చుక్కల భూములు, సర్వీసు ఇనాము భూములకు సంబంధించిన భూ వివరాలను సదరు దరఖాస్తుల్లో నింపి తహసీల్దారుల చేత సంతకాలు చేయించుకొని ప్రత్యేక ఉప కలెక్టర్లకు అందజేస్తున్నారు. నిబంధనల ప్రకారం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలు తెలుసుకుని నిర్దేశించిన ప్రొఫార్మాలో దస్త్రాలు నింపాలి. అలా జరగడం లేదు. ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందన్న ఉద్దేశంతో హడావుడిగా చేస్తున్నారు.

✦ ఎసైన్‌మెంట్ కమిటీ రిజిస్టర్లు లేకపోయినా, డి.పట్టాలు కానరాకున్నా భూయాజమాన్య హక్కులు కల్పించినట్లు తెలుస్తోంది. పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్య హక్కులు కల్పించారన్న విమర్శలున్నాయి.



అసైన్‌మెంట్ లబ్ధిదారులకు పెద్దఎత్తున లబ్ధి చేకూరుస్తున్నట్లు వైకాపా ప్రభుత్వం గతేడాది ఆర్భాటంగా ప్రకటించింది. జిల్లాలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 652.58 ఎకరాలు, నందికొట్కూరు 123.23, శ్రీశైలం 952.34, బనగానపల్లి 752.45, డోన్ 123.38, నంద్యాల 65.28 ఎకరాలు కలిపి 2,669.26 ఎకరాల ఎసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేసినట్లు ప్రాథమికంగా తేలింది. వీటితోపాటు వేలాది ఎకరాల సర్వీసు ఇనామ్ భూములకు భూయాజమాన్య హక్కులు కల్పించారు. కర్నూలు రూరల్ మండలంలో 2,241.76 ఎకరాలు, వెల్దుర్తి 2,034.31, కోడుమూరు 1,905.72, కల్లూరు 1,882.67, ఓర్వకల్లు 1,838.04, గూడూరు 1,624.36, సి.బెళగల్ 895.42, కర్నూలు అర్బన్‌లో 74.98 ఎకరాలు ఉన్నాయి.

పత్తికొండదే పైచేయి

✦ పత్తికొండ డివిజన్‌లో మొత్తం తొమ్మిది మండలాలు ఉండగా అందులో పెద్దఎత్తున ఎసైన్డ్ భూములు ఫ్రీహోల్డ్ అయ్యాయి. ఆస్పరిలో 2,470.90 ఎకరాలు, దేవనకొండ 1,524.06, కృష్ణగిరి 1,527.29, పత్తికొండ 1,768.79, తుగ్గలి 1,764.99, ఆలూరు 865.23, మద్దికెర 768.85, చిప్పగిరి 224.89, హాలహర్విలో 69.68 ఎకరాలు కలిపి డివిజన్ పరిధిలో 10,984.68 ఎకరాలకు గత వైకాపా ప్రభుత్వంలో యాజమాన్య హక్కులు కల్పించారు.

✦ ఆదోని డివిజన్ పరిధిలో పరిశీలిస్తే కౌతాళంలో 1,035.08 ఎకరాలు, నందవరం 398.3, ఎమ్మిగనూరు 201.91, పెద్దకడబూరు 137.41, కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో సి.బెళగల్ మండలంలో 186.36 ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పించారు.

జిల్లాలో 15,497.08 ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా వెల్లడించింది. ప్రస్తుతం ఫ్రీహోల్డ్ భూముల పునః పరిశీలన, రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిపై సమగ్రంగా విచారణ జరుగుతోంది. 876 మందికి 1,590.53 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారులు తెలిపారు

గుట్టుగా రిజిస్ట్రేషన్లు

428 మందికి 673.89 ఎకరాలు, బహుమతి రిజిస్ట్రేషన్ 367 మందికి 653.45 ఎకరాలు, పార్టీషన్ (విభజన) 14 మందికి 55.36 ఎకరాలు, మార్టిగేజ్ కింద 40 మందికి 125.87 ఎకరాలు, వివిధ మతాల కింద 15 మందికి 42.10 ఎకరాలు, రద్దు చేసుకున్నవి.. 2 డాకుమెంట్లు 5.30 ఎకరాలు, కోర్టు సేల్ డీడ్ కింద ఒకటి 1.75 ఎకరాలు, లీజ్ డీడ్ కింద 9 మందికి 32.82 ఎకరాలు కలిపి మొత్తం 876 మందికి 1,590.53 ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి.

ప్రస్తుతం ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన, రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిపై సమగ్రంగా విచారణ చేపట్టింది. ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 19.73 ఎకరాలు, ఆలూరు 26.38, ఆస్పరి 57.53, గూడూరు 15.14, కోడుమూరు 91.33, పత్తికొండ 55.19, ఓర్వకల్లు 38.38, ఎమ్మిగనూరు 30.40, కర్నూలు 67.43, కల్లూరు 25.80 ఎకరాలు కలిపి మొత్తం 427.313 ఎకరాల్లో ఫ్రీహోల్డ్ భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు నిర్ధారించారు.

రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిల్లో విక్రయ, గిఫ్ట్ డీడ్ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న ఎసైన్డ్ భూముల డీ-నోటిపై చేసిన వాటిని రిజిస్ట్రేషన్ చేయకూడదని ప్రభుత్వం ఆదేశించింది. కర్నూలు రూరల్ మండలం పి.రుద్రవరంలో సర్వే నంబరు.408 హెచ్ తోపాటు మరో సర్వే నంబరులో 5 రిజిస్ట్రేషన్లు జరిగాయి.



సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

స్వర్ణాంధ్ర 2047 జిల్లా ప్రణాళిక సిద్ధం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలో భాగంగా రాబోయే రోజుల్లో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సెంటినరి హాల్‌లో స్వర్ణాంధ్ర-2047 జిల్లా దార్శనిక పత్ర ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల ప్రతినిధులతో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం ఆమె నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, సీపీవో వేణుగోపాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభల్ని నిర్వహించి ప్రజాభిప్రాయాలు సేకరించి మండల స్థాయి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

అదనపు ఎస్పీగా యుగంధర్‌బాబు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా అదనపు ఎస్పీగా ఎన్.యుగంధర్‌బాబు నియమితులయ్యారు. నంద్యాల డీఎస్పీగా ఉన్న ఆయన ఇటీవల అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన సంగతి విదితమే. జిల్లాలో అదనపు ఎస్పీ స్థానం ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం ఆయన్ను అక్కడే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విశ్వమిథ్యాలయం



■ ఆర్‌యూలో మసకబారిన ఇంజినీరింగ్ విద్య
■ ఈ ఏడాది పడిపోయిన ప్రవేశాలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం(ఆర్‌యూ)లో ఇంజినీరింగ్ విద్య మసకబారింది. సౌకర్యాలు లేకపోవడంతో ప్రవేశం తీసుకోవడానికి విద్యార్థులు ఆసక్తి కనబరచడం లేదు. ఈ ఏడాది మొదటి విడత కౌన్సెలింగ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో నలుగురు విద్యార్థులు చేరారు. రెండో విడత కౌన్సెలింగ్ సమయానికి ఇద్దరు మరో కళాశాలకు వెళ్లడంతో ఇద్దరికే పాఠాలు బోధించాల్సి వస్తోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గత ఐదేళ్ల వైకాపా హయాంలో వర్సిటీలో రాజకీయం పెత్తనం చేసింది.. పాలక వర్గం సౌకర్యాలపై శీతకన్నేసింది.. ఫలితంగా కనీసం సగం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి సౌకర్యాలు మెరుగు పరచాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.

చేరింది కొందరే

ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో గత ఐదేళ్లుగా పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కావడం లేదు. మొత్తం సీట్లలో 45 శాతం మాత్రమే భర్తీ అవుతోంది. 2023-24లో సివిల్ ఇంజినీరింగ్‌లో ఒక్క విద్యార్థీ చేరలేదు. మెకానికల్‌లో ఇద్దరే చేరారు. ఆర్టిఫిషియల్ ఇంజినీరింగ్‌లో 20 మంది, ఈసీఈ 48, సీఎస్‌ఈలో 107 మంది ప్రవేశం పొందారు. 2024-25లో 396 సీట్లు భర్తీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో 10 మంది, మెకానికల్‌లో ఇద్దరు, ఈసీఈ 64, సీఎస్‌ఈ 132, ఆర్టిఫిషియల్ ఇంజినీరింగ్‌లో 62 మంది చేరారు. మెకానికల్‌లో చేరిన ఇద్దరికి కళాశాల ప్రిన్సిపల్ పాఠాలు బోధిస్తారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేవారు తక్కువగా ఉండటంతో మూతపడే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది.

ప్రయోగాలు పక్క కళాశాలలో

ఆర్‌యూలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు సరైన వసతులు కల్పించడం లేదు. ప్రయోగాల కోసం సమీపంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. దీంతోపాటు వసతిగృహాల్లో సౌకర్యాలు అధ్వానంగా ఉంటున్నాయి. భోజనం నాణ్యతగా ఉండటం లేదు. అవసరమైన అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఇంజినీరింగ్ విద్య చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. మొత్తం సీట్లలో 45 శాతం భర్తీ అవుతున్నాయి.

దక్కని గుర్తింపు

వర్సిటీల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, బోధన ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ జాతీయ గుర్తింపు మదింపు కమిటీ (న్యాక్) గ్రేడింగ్ ఇస్తుంది. 2022లో ఆర్‌యూ గ్రేడ్ 'ఏ' నుంచి 'బీ'కి పడిపోయింది. ప్రస్తుత 'బి' గ్రేడ్ కూడా దక్కక పోవడం గమనార్హం. కళాశాలల ఎంపికలో విద్యార్థులు న్యాక్ గ్రేడ్ కచ్చితంగా పరిశీలిస్తారు.. అక్కడ లభించే వసతులపై ఆరా తీస్తారు. ఆర్‌యూలో సౌకర్యాలు అధ్వానంగా ఉండటంతో అడ్మిషన్లు సరిగా జరగడం లేదని అధ్యాపకులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది.

సున్నిపెంట..

ఆక్రమణలే నిండా



గుర్తు తెలియని వ్యక్తులు నేలమట్టం చేసిన ప్రభుత్వ భవన సముదాయాలు

ఈనాడు, నంద్యాల : సున్నిపెంటలో పంచాయతీ, నీటి పారుదల శాఖ భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నా అధికారుల్లో కదలిక లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో సున్నిపెంట పంచాయతీకి 280.74 ఎకరాలు బదలాయించారు. పంచాయతీని ఏర్పాటు చేసినా సిబ్బంది నియమించలేదు. ఆత్మకూరుకు చెందిన ఓ అధికారికి పంచాయతీ కార్యదర్శిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆక్రమణలు అడ్డుకోవడం తన ఒక్కడితో కాదంటూ ఆయన చేతులెత్తేశారు. ఇటీవలికాలంలో కొందరు బరితెగించారు. ఆక్రమించుకోవాలన్న లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను కూల్చేస్తున్నారు. కబ్జా విషయాన్ని ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

పంచాయతీకి బదలాయించిన 280.74 ఎకరాల్లో అప్పటికే కొంత భూమి ఆక్రమణకు గురైంది. కొందరిపై అధికారులు మొక్కుబడిగా ఫిర్యాదు చేయడం.. పోలీసులు కేసు నమోదు చేసినా దర్యాప్తుల్లో పురోగతి ఉండటంలేదు. ఫలితంగా ఆయా భూములు కబ్జాదారుల చెర నుంచి విముక్తి కావడం లేదు. శ్రీశైలం ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సున్నిపెంటలోని కొన్ని లాడ్జీలు, కొన్ని నిర్మాణాలకు విద్యుత్తు సదుపాయం ఆపివేయించారు. అక్రమ నిర్మాణాలు జరిగితే వెంటనే ఆపేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. కబ్జాదారులపై సుమారు రెండు నెలలపాటు కఠినంగా వ్యవహరించిన అధికారులు ప్రస్తుతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఆక్రమణల పర్వం మళ్లీ ఊపందుకుంది. ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలిచ్చినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

పడగొడుతున్నా పట్టించుకోరు

- శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే తాజాగా ఒక హోటల్ నిర్మిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వెస్ట్రన్ కాలనీలో ఓ భవన నిర్మాణం జరుగుతోంది.
- సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలోనే ఉన్న వసతిగృహాలను కొందరు కబ్జా చేశారు. ఇవి వైద్య సిబ్బందికి చెందినవి కావడంతో ఓ వైద్యుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నేటికీ కేసు నమోదు చేయలేదు.
- ప్రభుత్వ వసతిగృహాల్లో రెండు 'ఎ టైపు' భవనాలను కొందరు అడ్డగోలుగా నేలమట్టం చేశారు. శిథిల భవనమైనప్పటికీ ప్రైవేటు వ్యక్తులు ఎలా కూలగొడతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆ భవనం కూల్చివేతపై అధికారులు ఫిర్యాదు చేసిన దాఖలాలే లేవు.
- స్థలాలు కబ్జా చేసిన కొందరి వద్ద గ్రామంలోని మరికొందరు కొనుగోలు చేశారు. వీటిల్లో నిర్మాణ పనులను తమకే అప్పగించాలంటూ తీవ్రమైన ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. పనులు అప్పగించకుంటే కబ్జా చేసిన భూములు తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చేస్తామని బెదిరిస్తున్నారు.

మద్యం టెండర్ల విధానం సులభతరం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీలో దుకాణాల టెండర్లు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో గుత్తేదారుడు సులభంగా వేసుకోవచ్చునని ఉమ్మడి జిల్లాల ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె నంద్యాల ఎక్సైజ్‌స్టేషన్‌ను పరిశీలించి అనంతరం మాట్లాడారు. టెండర్లు వేయడానికి ఎక్సైజ్‌స్టేషన్లలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎవరైనా స్టేషన్‌కు వచ్చి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిజిటల్ సహాయకులు, బ్యాంకు సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచామన్నారు. 9న సాయంత్రం 5 వరకే గడువుందన్నారు. ఈనెల 11న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టెండర్లకు సంబంధించిన లాటరీ తీస్తారని 12 నుంచి నూతన మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. 105 దుకాణాలకు గాను ఇప్పటికి 15 మంది టెండర్లు వేశారన్నారు. నంద్యాల ఈఎస్ రవికుమార్, సీఐ కృష్ణమూర్తి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎస్పీ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో 'గ్రీవియన్స్ డే'ను నిర్వహించిన ఆయన పోలీసుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలోని ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురి బదిలీలు, వైద్య సంబంధ నిధుల సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటికి పరిష్కారం చూపుతామన్నారు.

పురవాసులకు తప్పిన చెత్తభారం

-ఆదోని పురపాలకం, కర్నూలు నగర పాలక సంస్థ, నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే

వైకాపా హయాంలో ఇంటింటి చెత్త సేకరణ పేరుతో ముక్కుపిండి 'పన్ను' వసూలు చేశారు. చెల్లించకపోతే అపరాధ రుసుము విధించారు.. అనవసర రాద్ధాంతం చేశారు. కాలనీవాసులు తిరగబడితే కుళాయిలు ధ్వంసం చేశారు.. ఇళ్ల ఎదుట చెత్త వేసి వికృత చేష్టలకు పాల్పడ్డారు. విసుగెత్తి ఎదురుతిరిగిన జనం చెత్త బుట్టలు విసిరేసినా మొండి పట్టు వీడక పట్టణ ప్రజలను ముప్పుతిప్పలు పెట్టారు. పుర ప్రజల ఇక్కట్లు గమనించిన 'కూటమి' ప్రభుత్వం చెత్త పన్ను ఎత్తేసింది. పురవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నంద్యాలలో ఏడాదిగా నిలిచిన ఇంటింటి చెత్త సేకరణ ఆటోలు

ముక్కుపిండి వసూలు

వైకాపా ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నుంచి ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ప్రతి నెలా ముక్కుపిండి మరీ చెత్త పన్ను వసూలు చేసేవారు. ఇంటికి నెలకు రూ.30-60, వాణిజ్య సముదాయాలు, వ్యాపార సంస్థలు తదితర వాటికి రూ.100 నుంచి రూ.5 వేల దాకా రుసుము విధించారు. వార్డుల వారీగా పురపాలక, సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి వసూలుకు యత్నించింది. చివరికి ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధి అయిన సామాజిక పింఛన్లలో కోతలు విధించడం, పొదుపు మహిళల నుంచి పొదుపు మొత్తాల నగదును మళ్లించడం వంటివి చేశారు. ఇలా ఇప్పటి వరకు రూ.15-16 కోట్లు ప్రజల నుంచి చెత్త పన్ను రూపంలో వసూలు చేశారు.

పురపాలకం	వార్డులు	వాహనాలు	ప్రస్తుతం తిరుగుతున్నవి	నెలవారీ పన్ను లక్ష్యం	ఇప్పటి వరకు వసూలు
కర్నూలు	52	100	91	రూ.కోటి	రూ.10 కోట్లు
ఆదోని	42	42	25	రూ.16 లక్షలు	రూ.కోటి
నంద్యాల	42	50	31	రూ.25 లక్షలు	రూ.15 లక్షలు
ఎమ్మిగనూరు	34	30	10	రూ.10 లక్షలు	రూ.కోటి

డోన్ పురపాలికలో 32 వార్డులు ఉన్నాయి. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా 25వ వార్డును పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇక్కడ 250కిపైగా గృహాలుండగా, వెయ్యికి పైగానే జనాభా నివసిస్తోంది. 120 వరకు దుకాణాలున్నాయి. తడి, పొడి, హానికర వ్యర్థాలను సేకరించేందుకు ఇంటింటికి 675 బుట్టలను పంపిణీ చేశారు. ఇక్కడ పది నెలలపాటు రూ.37 వేల వరకు చెత్త పన్ను వసూలు చేశారు. తర్వాత ప్రజల నుంచి అభ్యంతరాలు రావడం, పన్నును వ్యతిరేకించడంతో వసూలు నిలిపేశారు.



గాడితప్పిన నిర్వహణ

⏩ ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగర పాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలికల్లో ఇంటింటి చెత్త సేకరణకు ఆటోలు కేటాయించారు. మొత్తం నాలుగు పురపాలికల్లో 170 వార్డులున్నాయి. మొదట్లో వార్డుకో ఆటోను కేటాయించారు. ఒక్కో ఆటోకు నెలవారీగా అద్దె రూ.63 వేలు ఉండేది, చివరికి రూ.68 వేలకు పెంచారు. పురపాలికల్లో చెత్త సేకరణకు గతంలోని వాహనాలకు ఇంధన సర్దుబాటు, ఇంటింటి చెత్త సేకరణ ఆటోల అద్దెలు రెండింటి నిర్వహణ తలనొప్పిగా మారింది.

⏩ ఇంటింటి చెత్త సేకరణ పనులను దక్కించుకున్న గుత్తేదారు ఆటోడ్రైవర్లకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి. నెలల తరబడి మొండి బకాయిలుండటంతో వాహన డ్రైవర్లు ఆందోళనలు, సమ్మెబాట పట్టారు. పలుచోట్ల నయానో భయానో సమ్మె విరమించేలా చేశారు. పలుచోట్ల ఎదురుతిరిగిన ఆటోడ్రైవర్లను విధుల నుంచి తొలగించారు. నంద్యాలలో సమ్మెలోకి వెళ్లిన ఆటోలు, సిబ్బంది నేటి వరకు బయటకు రాలేదు. ఆటోలకు అద్దెలు చెల్లించలేక చాలా వార్డుల్లో నిలిపేస్తూ వచ్చారు. మొత్తం 222 ఆటోలకుగాను ప్రస్తుతం 157 తిరుగుతున్నాయి.

నారా లోకేష్‌ను కలసిన ధర్మవరం



డోన్, న్యూస్‌టుడే : రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ని మంగళగిరిలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విత్తనాభివృద్ధి పదవి ఇవ్వడంపై లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ని కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట పట్టణ తెదేపా అధ్యక్షులు సీఎం శ్రీను, ఆలామల్లికార్జునరెడ్డి యువ నాయకులు గౌతంరెడ్డి ఉన్నారు.


బండిఆత్మకూరు: ఓంకారంలో బాలాత్రిపుర సుందరిదేవి


వాగలమర్రి: సావిత్రిదేవి


బనగానపల్లి గ్రామీణం: బ్రహ్మచారిణిగా చౌడేశ్వరిదేవి


ప్యాపిలి: బాలత్రిపురసుందరిదేవి


నందికొట్కూరు: గాయత్రి దేవి

దుష్ట సంహారిణి... దుర్గారూపిణి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కొలువుదీరిన అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. నీ ఆశీర్వచనాలే మాకు రక్ష... కాపాడుతల్లీ.. అంటూ మనసారా పూజించారు. పలు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే బృందం


ఆళ్లగడ్డ: అన్నపూర్ణా దేవి అలంకారంలో అమ్మవారు


శ్రీశైలం ఆలయం: శంఖు, ఢమరుక నాదాలతో సందడి


శ్రీశైలం ఆలయం: నృత్యం చేస్తున్న కోయ గిరిజనులు


శ్రీశైలం ఆలయం: మయూర వాహనంపై కొలువైన స్వామిఅమ్మవారు


శ్రీశైలం ఆలయం: కేరళా వాయిద్యాలతో ఆకట్టుకుంటున్న కళాకారులు


శ్రీశైలం ఆలయం: కన్నడ కళాకారుల సందడి

ఇష్టం లేకున్నా.. కష్టంగా విధులు

☛ జిల్లా విద్యాశాఖలో ఇన్‌ఛార్జుల పాలన

☛ కొరవడిన పాఠశాలల పర్యవేక్షణ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ దిశగా జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాల్సి ఉంది. అయితే.. జిల్లా విద్యాశాఖలో కీలకమైన పోస్టుల్లో ఇన్‌ఛార్జులు ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ, ఉత్తీర్ణతపై ప్రభావం చూపుతోందని విద్యావేత్తలు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టిన విషయం తెలిసిందే. దీనికి భయపడి జిల్లా కేంద్రంలోని పోస్టుల్లో ఫారిన్ సర్వీస్ పద్ధతిలో విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ ప్రభుత్వంలోనైనా ఇన్‌ఛార్జుల పాలనకు ముగింపు ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు. రెగ్యులర్ అధికారులుంటే బడుల్లో జరిగే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు సమస్యల పరిష్కారానికి వీలుంటుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 23 ఎంఈవో పోస్టులు ఖాళీ

నంద్యాల జిల్లాలో ఎంఈవో-1 పోస్టులు 12, ఎంఈవో-2 పోస్టులు 3, కర్నూలు జిల్లాలో ఎంఈవో-1 పోస్టులు 7, ఎంఈవో-2 పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. ఈ పోస్టులు గత రెండేళ్ల నుంచి ఖాళీగానే ఉన్నాయి. కొన్నిచోట్ల సీనియర్ ప్రధానోపాధ్యాయులకు పాలనాపరంగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. కర్నూలు జిల్లాలో ఎంఈవో-1 హోదాలో ఆదోని, హొళగుంద, కోసిగి, కౌతాళం, ఓర్వకల్లు, పత్తికొండ, తుగ్గలి మండలాలు, ఎంఈవో-2 కౌతాళం మండలాలు ఖాళీగా ఉన్నాయి. అలాగే నంద్యాల జిల్లాలో ఎంఈవో-1 హోదాలో ఆత్మకూరు, దొర్నిపాడు, గడివేముల, జూపాడుబంగ్లా, కొలిమిగుండ్ల, కొత్తపల్లి, మిడుతూరు, ప్యాపిలి, రుద్రవరం, సంజామల, ఉయ్యాలవాడ, నందికొట్కూరు మండలాలు, ఎంఈవో-2 హోదాలో బేతంచెర్ల, డోన్, మహానంది మండలాలు ఖాళీగా ఉన్నాయి. ఈ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ సరిగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మేం నిర్వహించలేం?

ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో జరిగే ప్రతి పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల రూపకల్పన, పత్రాల సరఫరా విషయంలో డీసీఈబీ విభాగం ఎంతో కీలకం. ఈ పోస్టులో గూడూరు ఎంఈవో-2 నాగరాజు డీసీఈబీ జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్నారు. అక్కడ, ఇక్కడ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక వనరులు లేకపోవడంతో ఈ పోస్టులో మేము విధులు నిర్వహించలేమని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. సి.బెళగల్ ఎంఈవో-2 ఆదాం బాషా కూడా ఉర్దూ పాఠశాలలకు జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా ఉన్నారు. ఈయన కూడా నేరుగా డీఈవోను కలిసి ఈ పోస్టులో నేను విధులు నిర్వహించలేనని పలుమార్లు లేఖ సమర్పించారు. ఈ రెండు హోదాలు విద్యా శాఖలో కీలకమైనవి. వీటిని భర్తీ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేందుకు వీలుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో దస్త్రాలు

కర్నూలు మండలం ఎంఈవో-1 హనుమంతరావును కర్నూలు డివిజన్ డిప్యూటీ ఈవోగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈయన మూడేళ్ల నుంచి ఉన్నారు. కర్నూలు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏదైనా జరిగిన ఘటనపై విచారణ అధికారిగా ఎక్కువ శాతం ఈయననే నియమిస్తున్నారు. ఎంఈవో-1 బాధ్యతలు ఉండటంతో విచారణ అంశాలను వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ ఈవో ఇక్కడ లేకపోవడంతో ఇదే కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ అధికారి ఇష్టారీతిగా పని చేస్తున్నట్లు సమాచారం. ఈయనపై ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.


కుమారుడికి అన్నం తినిపిస్తున్న తల్లి జయలక్ష్మి

ఇల్లాలి గుండెలో కన్నీటి కడలి

■ కదల్లేని స్థితిలో భర్త, కొడుకు ■ ఇద్దరినీ కంటికి రెప్పలా కాస్తున్న జయలక్ష్మి

ఆ తల్లిని కదిలిస్తే.. కన్నీటి కడలి కదిలొస్తుంది. అనుక్షణం భర్త వెన్నంటే ఉంటున్నారు.. వెన్ను దన్ను లేక ఉండిపోయారు. కన్నకొడుకు ముద్దు మాటలు వినాలన్న సంబరం.. ఆమెకు దరిచేర లేదు. బాలుడి పరిస్థితి చూసి కన్నపేగు విలవిల్లాడింది. భర్త దీనావస్థతో నిత్యం వేదనకు గురవుతోంది. ఇద్దరికీ సపర్యలు చేయడంతోనే సమయం సరిపోతోంది.. కూలి పనులకు వెళ్లలేక జీవనం భారంగా సాగుతోంది. ఆ మహిళ వేదనను చూసి విధిసైతం విలపిస్తోంది. పత్తికొండ మండలం హోసూరుకు చెందిన జయలక్ష్మి దీన గాథ ఇది.

- న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో ఊరు బావి వీధిలో నివాసం ఉంటున్నారు. జయలక్ష్మి, పెద్దయ్య. కుమారుడు ఎర్రిస్వామి. కూలీనాలి చేసుకుని కుటుంబాన్ని పోషించేవారు. ఉన్నంతలో వారు ఆనందంగా గడిపారు. కుమారుడి ముద్దు ముద్దు మాటలు అల్లరి ఆటలతో తల్లిదండ్రులు పొంగిపోయారు. ఉన్న ఊరిలోని పాఠశాలకు సైతం పంపారు. బాలుడు ఏడేళ్ల వయసులో చిన్నపాటి అనారోగ్యానికి గురయ్యాడు. స్థానిక వైద్యులకు చూపించారు. చిన్నపాటి అనారోగ్యమే పెద్ద జబ్బుగా మారి ఆతని జీవితాన్ని అతలాకుతలం చేస్తుందని ఆ తల్లిదండ్రులు ఊహించలేకపోయారు. కొన్ని రోజులకే కుమారుడి అడుగు ఆగిపోయింది.. గొంతు మూగబోయింది. ఇదంతా చూసి తల్లిదండ్రులకు గుండె భారంగా మారింది. వెళ్లని ఆసుపత్రి లేదు.. సంప్రదించని వైద్యులు లేరు. బాలుడి ఆరోగ్యం కుదుట పడకపోగా.. రోజురోజుకు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వైద్యం కోసం రూ.6లక్షలకు పైగా ఖర్చు చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదు. కొడుకు పరిస్థితి చూసి కన్నీరు ఆగలేదు. చేసేది లేక దుఃఖాన్ని దిగమింగి కూలిపనులకు వెళ్తూ.. బతుకు జీవుడా అంటూ కాలం గడుపుతున్నారు.

మళ్లీ మరో పిడుగు

అసలే కుమారుడి పరిస్థితితో పుట్టెడు దుఃఖంలో ఉన్నారు. అలాంటి సమయంలో మరో పిడుగు. ఓ గొర్రెల వ్యాపారి దగ్గర కూలిపనులకు వెళ్లారు జయలక్ష్మి భర్త పెద్దయ్య. తాడిపత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తే ఆతని వెన్నెముక పూర్తిగా దెబ్బతిందని చెప్పడంతో ఆమె వెన్నులో వణుకుపుట్టింది. కంట నీరు ఆగలేదు. ఆయన కదలడం కష్టమని వైద్యులు తేల్చిచెప్పారు. భర్త వైద్యానికి మరో ఐదు లక్షలు ఖర్చు చేసినా.. ఏ మాత్రం ఫలితం లేకుండా పోయింది. అటు కుమారుడి వైద్యానికి, ఇటు భర్త మందులకు నెలకు కనీసం రూ.10వేలకు పైగానే ఖర్చు తప్పడం లేదు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ప్రభుత్వం నుంచి కుమారుడికి వచ్చే రూ.6వేల పింఛను ఏమాత్రం అవసరాలు తీరడం లేదు. ఒకే రేషన్‌కార్డులో ముగ్గురు కుటుంబ సభ్యులు ఉండటంతో.. సాంకేతికంగా ఇద్దరికి పింఛన్ అందించడం ఇబ్బందిగా మారింది. వారి ఆలనా పాలనా ఆమెకు భారంగా మారింది. కుటుంబ పరిస్థితి అర్థం చేసుకొని కుమారుడికి, భర్తకు పింఛను అందేలా చూడాలని జయలక్ష్మి కన్నీటిపర్యంతం అవుతున్నారు.


మంచానికి పరిమితమైన పెద్దయ్య

ప్రతి రైతుకు నష్ట పరిహారం చెల్లిస్తాం


రైతులతో మాట్లాడుతున్న జేసీ విష్ణు చరణ్

బేతంచెర్ల, న్యూస్‌టుడే : రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న రైతులకు, గ్రామ ప్రజలకు భూ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లిస్తామని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. బేతంచెర్ల నుంచి రామళ్లకోట వరకు రెండు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. ఈ దారిలో ఇళ్లు, స్థలాలు, భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించడానికి ముద్దవరం, పెండేకల్లు గ్రామాల రైతులతో డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎకరాకు రూ.80 లక్షల చొప్పున ధరను నిర్ణయిస్తూ జేసీ ప్రకటించారు. ఇందులో సెంటు, అర సెంటు ఉన్నా కూడా నష్టపరిహారం అందజేస్తామన్నారు. గతంలో భూములు కోల్పోయి ఇప్పటి వరకు పరిహారం అందని రైతులకు, త్వరలోనే పరిహారం వచ్చే విధంగా చూస్తామన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల


డోన్ న్యూస్‌టుడే : డోన్ నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ఇందుకోసమే పట్టణాలు, గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకునేందుకు వినతుల స్వీకరణ చేపట్టానని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీల ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

శ్రీశైలం జలాశయానికి 85,302 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు నుంచి 85,302 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 54,695 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

రూ.కోట్ల ఆదాయం.. మామిడి తోరణాలు కరవు

మహానంది, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల సందర్భంగా చిన్న గ్రామాల్లోని దేవాలయాలను మామిడి తోరణాలు, విద్యుత్తు దీపాలతో అలంకరిస్తున్నారు. కానీ మహానంది క్షేత్రంలో ఉత్సవాల శోభ కనిపించడం లేదు. ఏడాదికి సుమారు రూ.17 కోట్ల మేర ఆదాయం వస్తోంది. ఇంత ఆదాయం ఉన్నా ఆలయం ద్వారాలకు కనీసం మామిడి తోరణాలు కూడా కట్టలేదు. ప్రతి సోమవారం, శుక్రవారం క్షేత్రంలోని ప్రతి ఆలయ ద్వారాలకు, గోపురాలకు మామిడి తోరణాలు కట్టాలి. కానీ తోరణాలు, విద్యుత్తు దీపాలంకరణ లేకపోవడంతో కళావిహీనంగా మారింది. ఉత్సవాల నేపథ్యంలో ఆలయానికి వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి స్వామిఅమ్మవారి దర్శనానికి వస్తారు. కనీసం మామిడి తోరణాలు కూడా కట్టలేదని భక్తులు ఆరోపిస్తున్నారు.


మామిడి తోరణాలు కూడా లేని మహానంది దక్షిణ గాలి గోపుర ద్వారం

వద్దు నిర్లక్ష్యం... పిలుస్తోంది ప్రమాదం


రాజ్ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనంపై ఆరుగురి ప్రయాణం


పురపాలిక కార్యాలయం ఎదురుగా అయిదుగురి ప్రయాణం

ద్విచక్ర వాహనాలపై పరిమితికి మించి చాలామంది ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇరుకుఇరుకుగా కూర్చొని ఇబ్బందికరంగా ప్రయాణిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని రాజ్‌థియేటర్, పురపాలక కార్యాలయం వద్ద ద్విచక్ర వాహనంపై అయిదుగుర్ని కూర్చోబెట్టుకుని ఒకరు వెళ్తుంటే... పురపాలక కర్యాలయం ఎదురుగా ఒకే వాహనంపైన అయిదుగురు ప్రయాణిస్తున్నారు. నంద్యాల నుంచి మహానందికి వెళ్లే చెరువుకట్ట రహదారిపైనా ఇబ్బందికరంగా వెళ్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ముప్పు పొంచి ఉంది. వాహనచోదకులు ప్రమాదకరంగా ప్రయాణించకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

-న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం


గోడపత్రాలను విడుదల చేస్తున్న ఫిరోజ్

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువత ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ.ఫిరోజ్ పేర్కొన్నారు. ఈనెల 8న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళా గోడపత్రాలను శుక్రవారం తన కార్యాలయంలో ఫిరోజ్ విడుదల చేసి మాట్లాడారు. చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగు సంస్థల్లో 338 కొలువులు జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారని వెల్లడించారు.

5, 6 తేదీల్లో రైతులతో ముఖాముఖి


మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఈ నెల 5, 6 తేదీల్లో సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా రైతులతో 'ముఖాముఖి', పర్యటన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 20 వేల హెక్టార్లలో మొక్కజొన్న వేయగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దీనికి నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో దళారులు రైతులను మోసగించి క్వింటా రూ.2300లకు కొంటుండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. క్వింటా మొక్కజొన్నకు రూ.3,300 గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించాలన్నారు. 7న జిల్లా మొక్కజొన్న రైతులతో కలిసి నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. రైతులతో ముఖాముఖి పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఇసుక దొంగతనంపై చర్యలకు డిమాండు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డులో 600 టన్నులకు పైగా ప్రభుత్వ ఇసుక మాయమైనా ఇంతవరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. దొంగతనం జరిగి 14 రోజులైనా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడానికి కారణాలు ఏమిటో చెప్పాలని ఆయన డిమాండు చేశారు. శుక్రవారం సాయంత్రం గంగుల బిజేంద్రనాథరెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి తదితరులు కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. భూమా కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు ప్రకారం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

గిరిజన సమస్యల్ని పరిష్కరించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గిరిజనుల సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ శుక్రవారం కలెక్టర్ జి. రాజకుమారిని కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆమెను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఉన్న 48 చెంచుగూడేల్లో మౌలిక వసతులు కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఆశ్రమ గురుకులాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఐటీడీఏ పరిధిలో మూడు అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గిరిజన తండాలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రవినాయక్, శ్రీనివాసుల నాయక్, ఈశ్వర్ నాయక్, నగేశ్ నాయక్, సుంకన్న, హనుమంతు నాయక్, విక్రమ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం



రహదారి మధ్యలో స్తంభం..రాకపోకలకు అడ్డం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మినగర్, రహ్మత్‌నగర్‌ల మధ్య అనుసంధానంగా ఉన్న రహదారి మధ్యలో సిమెంటు స్తంభం ఏర్పాటు చేశారు. సిమెంటు రహదారి నిర్మాణ సమయంలో స్తంభాన్ని తొలగించకుండానే రహదారి నిర్మించటం వల్ల ఈ దుస్థితి తలెత్తింది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనం, ఆటో వెళ్లాలన్నా ఇబ్బందిగానే ఉంది.

రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన స్తంభం

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని టిడ్కో గృహాల నుంచి మురుగు లీకవుతోంది.
-మహమ్మద్, స్థానికుడు

సమాధానం: త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.
-నిరంజన్‌రెడ్డి, పురపాలక కమిషనర్

సమస్య: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట గుంతలో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
-సత్యరాజ్, స్థానికుడు

సమస్య: బాలాజీ కాంప్లెక్స్‌లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. పిల్లలు బయటికి వెళ్లాలంటే భయపడుతున్నారు.
-నూర్‌బాషా, స్థానికుడు

సమాధానం: త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం.
-లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టరు

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాణ్యంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పెద్ద ఎత్తున ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై వినతిపత్రాలు తీసుకుని వాటిని స్వయంగా తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

57 మంది గైర్హాజరు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మండలంలోని అయ్యలూరిమెట్టలో ఉన్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 175 మందికి గాను 24 మంది, సాయంత్రం 175 మందికి గాను 33 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద గ్రామీణ సీఐ అస్రార్‌బాషా బందోబస్తు నిర్వహించారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

బాలికల హక్కులు రక్షించడం కర్తవ్యం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికల హక్కులను రక్షించడం మన కర్తవ్యమని న్యాయవాది హేమలత అన్నారు. శుక్రవారం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు దేశానికి కుటుంబానికి వెలుగులు పంచే జ్యోతులన్నారు. ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ అశోక్‌కుమార్, డీన్ రామిరెడ్డి, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త హరిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు స్పందన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళలో 245 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా. జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బృంద చర్చలు, ఆన్‌లైన్ పరీక్షలను అభ్యర్థులకు నిర్వహించామన్నారు. సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ ప్రశాంత్, సంస్థల ప్రతినిధులు బచ్చు శ్రీనివాస్, వినీత్, హరీష్, కల్యాణి, క్రాంతి, భావన, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, సంచాలకులు హేమంత్‌రెడ్డి, మేనేజర్ ప్రగతిరెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి యూవీఎస్. కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుకు కష్టాలే!



నంద్యాల కొత్త బస్టాండులోని ప్రైవేటు మరుగుదొడ్డి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల ఆర్టీసీ బస్టాండులో ప్రైవేటు మరుగుదొడ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రయాణికుల నుంచి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రయాణికులు.. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల బస్టాండులో ఒక వ్యక్తి ప్రైవేటు మరుగుదొడ్డిని వాడితే రూ.3 చెల్లించాలని గోడపై రాశారు. మహిళలు మూత్రశాలను వినియోగించుకున్నా.. రూ. 10 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే వెటకారపు మాటలతో హేళన చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ముక్కుపిండి రూ. 10 వసూలు

నంద్యాల ఆర్టీసీ కొత్త బస్టాండులో ఒకటి, పాత బస్టాండుకు ఎదురుగా ఇంకో మరుగుదొడ్డి ఉన్నాయి. బస్టాండ్లలో బీవోటీ(బిల్ట్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) స్కీంతో ప్రైవేటు వ్యక్తులు మరుగుదొడ్లను నిర్మించుకునేందుకు స్థలం కేటాయిస్తారు. మరుగుదొడ్లను నిర్మించిన సంస్థ ప్రయాణికుల నుంచి ఆర్టీసీ నిర్ణయించిన నామమాత్రపు రుసుంను 20 ఏళ్ల పాటు వసూలు చేయాలి. మరుగుదొడ్లను వినియోగించినప్పుడు మాత్రమే రూ. 3 చెల్లించాలి. మరుగుదొడ్ల గోడపై మల విసర్జనకు రూ.3 మూత్రవిసర్జన ఉచితం అని రాసి ఉన్నా ప్రయాణికుల నుంచి రూ. 10 ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.



రూ.10 తీసుకున్నారు..
-వెంకటలక్ష్మమ్మ, ప్రయాణికురాలు

బస్టాండులో ప్రైవేటు మరుగుదొడ్డిలోని మూత్రశాలకు వెళ్తే రూ.10 తీసుకున్నారు. ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని అడిగితే అడిగినంత ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేశారు.

అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు:
-గంగాధర రావు, ఆర్టీసీ డీఎం.

నంద్యాల ఆర్టీసీ బస్టాండులోని మరుగుదొడ్లలో ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనలు పాటించకపోతే జరిమానాలు విధిస్తాం.

శిథిలావస్థలో మరుగుదొడ్లు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు ఆర్టీసీ బస్టాండులో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. పురుషుల మరుగుదొడ్లలో వేసిన బండ పరుపులు పగిలి పాడయ్యాయి. మూత్రశాలలో నీటి సదుపాయం లేక దుర్వాసన కొడుతున్నాయి. నందికొట్కూరు డిపోకు నందికొట్కూరు డిపోకు చెందిన బస్సులే కాకుండా కర్నూలు, నంద్యాల జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల డిపోల నుంచి, కర్ణాటక రాష్ట్రం నుంచి బస్సులు డిపో మీదుగా ఇతర ప్రాంతాలకు సుమారు 50 బస్సుల వరకు వెళ్తుంటాయి. ప్రస్తుతం నిర్వహణ లేక దుర్వాసన వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.



నందికొట్కూరు: ఆర్టీసీ బస్టాండు వద్ద స్వచ్ఛ భారత్ మరుగుదొడ్లు

కన్పించకుండా

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్ల వద్ద నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఆత్మకూరు బస్టాండులో సుమారు పది మరుగుదొడ్లు నిర్వహిస్తున్నారు. ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండుకు ప్రతి రోజూ పది వేల మంది రాకపోకలుసాగిస్తున్నారు. మరుగుదొడ్డి నిర్వహణకు వసూలు చేయాల్సిన డబ్బుల వివరాలర గోడలపై పొందుపరచాల్సి ఉన్నా ధర మాత్రం కన్పించకుండా చేశారు.



ఆత్మకూరు బస్టాండులోని మరుగుదొడ్లు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నందికొట్కూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ దివ్య పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం విదాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జీ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని.. దీంతో పాటుగా మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. న్యాయవాదులు వెంకటరమణ, మద్దయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి దివ్య

తక్కువ ధరకు అందించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్కువ ధరకు ఇసుకను అందించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు అన్నారు. శుక్రవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రహదారిపైన సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అందుబాటులో లేకుండా పోయిందని విమర్శించారు. ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చినా గతం కంటే ధర అధికంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఇసుక రేవులను ఏర్పాటు చేసి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. నాయకులు పుల్లా నరసింహులు, కేఎండీ గౌస్, లక్ష్మణ్, వెంకటలింగం, బాల వెంకట్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

వెలుగోడు, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు మహమ్మద్ రఫీ, నాగమోహన్ డిమాండ్ చేశారు. వెలుగోడు తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.



వెలుగోడు: వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అందుబాటులోకి శ్రీగోకులం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని మల్లమ్మ కన్నీరు ఆలయం వద్ద ఉన్న శ్రీగోకులం అందుబాటులోకి వచ్చింది. శ్రీగోకులం నిరుపయోగంగా మారిన విషయాన్ని గత నెల 30న 'కట్టించారు.. పట్టించుకోరు' అనే శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన కథనానికి దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు స్పందించారు. శ్రీగోకులాన్ని శుక్రవారం ఉదయం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నిరుపయోగంగా ఉన్న విషయాన్ని గుర్తించి శుభ్రం చేయించారు.



పగిడ్యాల: పాత ముచ్చుమర్రి జంబులా పరమేశ్వరి ఆలయంలో..



బండి ఆత్మకూరు: కాకనూరులో బాలాత్రిపురసుందరి అలంకరణలో..



మహానంది: బుక్కాపురంలో అమ్మవారికి పూజలు



నంద్యాల: ఉప్పరిపేటలో గాయత్రి దేవి

జగజ్జనని.. శుభకారిణి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నంద్యాల జగజ్జనని దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహానందిలో అమ్మవారు సింహవాహనంపై బ్రహ్మచారిణీ దుర్గా అలంకరణలో, ఓంకార క్షేత్రంలో బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. నందికొట్కూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రిదేవిగా పూజలందుకున్నారు. కాకనూరులో పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి ప్రత్యేక పూజలు జరిపారు. -న్యూస్‌టుడే బృందం



మహానంది: గ్రామోత్సవంలో సింహవాహనంపై బ్రహ్మచారిణీ దుర్గగా....



నందికొట్కూరు: వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రిదేవి



నంద్యాల: బాలకొండహల్ వీధిలో గాయత్రి దేవి



నందికొట్కూరు: బైరెడ్డినగర్ కాలనీలో గాయత్రిదేవి



నంద్యాల: ఏకలవ్యనగర్‌లో గాయత్రి దేవి

హామీలు నెరవేర్చాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వరకు వెళ్లి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం డిమాండు చేశారు. ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

విజయవాడలో వడ్డె ఓబన్న 227 జయంతి

తిమ్మాపురం (మహానంది), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 227వ జయంతి వేడుకలను 2025 జనవరి 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు మహాసభ ఆర్గనైజర్ సంజీవరాయుడు తెలిపారు. ఎం. తిమ్మాపురంలో వడ్డె వేముల వెంకటస్వామితో పాటు పలువురు వడ్డెరలను శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి హెబ్సీబా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రధానాచార్యులు షేక్షావలి పేర్కొన్నారు. గత నెల 26న కర్నూలులో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ రియాజ్‌వుద్దీన్ శుక్రవారం తెలిపారు.

అవీ.. ఇవీ.. న్నీ..

గడివేముల, న్యూస్‌టుడే: గడివేముల ఎంపీడీవోగా వాసుదేవగుప్తా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

గడివేముల, న్యూస్‌టుడే: గడివేముల తహసీల్దారుగా వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండల ఎంపీడీవోగా మహబూబ్ దౌలా, ఈవోఆర్డీగా పీ. నాగేంద్రుడు బాధ్యతలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: బండిఆత్మకూరు ఎంపీడీవోగా దస్తగిరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యం ఎంపీడీవోగా ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

పాములపాడు, న్యూస్‌టుడే: పాములపాడు ఎంపీడీవోగా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

మిడుతూరు,న్యూస్‌టుడే : మిడుతూరు నూతన ఎంపీడీవోగా దశరథరామయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎంపీడీవోగా గోపికృష్ణా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

నాటుసారా స్వాధీనం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని నీలి షికారీ కాలనీలో నాటుసారా స్థావరాలపై సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 1,500 లీటర్ల ఊటను ధ్వసం చేసినట్లు సీఐ తెలిపారు.

దాడి చేశారని కేసు నమోదు

నంద్యాల గ్రామీణం,న్యూస్‌టుడే: డబ్బు అడిగితే ఇవ్వలేదన్నందుకు దాడిచేసిన ఘటన శుక్రవారం పెద్దకొట్టాల శివారులో జరిగింది. పట్టణంలోని విశ్వనగర్‌కు చెందిన మద్దిలేటి, అతని స్నేహితుడు సూరి ద్విచక్రవాహనంపై పెద్దకొట్టాలకు వెళ్తున్నారు. మార్గ మధ్యలో వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన లక్ష్మిదేవి, ఆమె అక్క కొడుకు అశోక్ బైక్ ఆపి రూ. 500లు అడిగారు. మద్దిలేటి వారితో డబ్బులు అడుక్కోవడానికి సిగ్గు లేదా? ఏదైనా పనులు చేసుకుని బతకొచ్చు కదా..? అని అన్నారు. డబ్బులు ఇవ్వక పోగా సిగ్గులేదా? అంటూ మాట్లాడతావా అంటూ మద్దిలేటితో లక్ష్మిదేవి, అశోక్ గొడవపడి దాడి చేశారు. మద్దిలేటి, సూరిల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అస్రార్ బాషా తెలిపారు.

వెండి కానుకలు అందజేత

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి నంద్యాలకు చెందిన వెన్నపూస ఈశ్వరరెడ్డి, సంజమ్మ, శివపవన్‌కుమార్‌రెడ్డి వెండి కిరీటాలు, హస్తాలను విరాళంగా ఇచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రెండో రోజు స్వామి వారిని దర్శించుకున్నారు. మూడు వెండి కిరీటాలు, నాలుగు అభయ వరద హస్తాలను ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి దాతలు అందజేశారు.



ఈవోకు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

అన్నదాత ఇంట..ఉద్యోగాల పంట

☛ నలుగురు పిల్లలకు ప్రభుత్వ కొలువులు

గడివేముల, న్యూస్‌టుడే: అది మారుమూల గిరిజన గ్రామం. కనీసం మంచినీళ్లు కూడా దొరకని వెనుకబడిన ప్రాంతం. వర్షాలు కురిస్తే ఆ ఏడాది నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లేవి. లేదంటే ఊరువిడిచి వలసలు వెళ్లాల్సిందే. ఇంతటి దుర్భర పరిస్థితి తమ పిల్లలకు రాకూడదని ఆ ఇంటి పెద్దాయన పిల్లల్ని కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల కష్టాలు చూసిన పిల్లలు బాగా చదివి ప్రభుత్వ కొలువులు సాధించి కన్నవారికి ఆనందాన్ని అందించారు. నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారు.



తల్లిదండ్రులు పుల్లన్న నాయక్, పుల్లిబాయితో పిల్లలు

☛ ఎల్‌కేతండాకు చెందిన పాట్లావత్ పుల్లన్న నాయక్, పుల్లిబాయికి నలుగురు సంతానం. పుల్లన్న నాయక్ పిల్లల్ని బాగా చదివించాలనుకున్నారు. కళాశాలల చదువుకు పిల్లలు చేరే సరికి ఆయనకు ఆర్థిక పరిస్థితి సహకరించలేదు. ఉచితంగా కళాశాలలో సీట్లు వచ్చినా కొంత డబ్బు ఖర్చు చేయాల్సి రావడంతో తన పరిస్థితిని యాజమాన్యానికి చెప్పారు. రుసుముల్లో రాయితీని పొంది పిల్లల్ని చదివించారు. పెద్దకుమారుడు రవీంద్ర నాయక్ ఎంటెక్ చదివాడు. పదో తరగతి వరకు గురుకుల పాఠశాలలోనూ, ఒంగోలులో ఇంటర్మీడియట్‌ను పూర్తి చేశారు. ఒకవైపు పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఆర్జీఎం కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసి జేఎన్‌టీయూలో ఎంటెక్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఎల్ఐసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండో కుమారుడు బాలాజీ నాయక్ కూడా ఎంటెక్ చదివారు. ప్రాథమిక విద్య గురుకుల పాఠశాలలో పూర్తి చేశారు. నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి కర్నూలు పుల్లారెడ్డి కళాశాలలో ఇంజినీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఆళ్లగడ్డలో గుత్త పద్ధతిన ఉద్యోగం చేస్తూ ఎంటెక్ పూర్తి చేశాడు. సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటూ పోటీ పరీక్షలు రాస్తూ ఏఈగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం పులివెందులలో పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. పెద్దకుమార్తె లక్ష్మిబాయి డిగ్రీ పూర్తి చేశారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో బ్రాంచి పోస్టుమాస్టరుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్న కుమార్తె విజయశాంతి బీటెక్ పూర్తి చేశారు. బనవాసి గురుకుల పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తిచేసి నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేశారు. పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించి సత్యసాయిజిల్లాలో ల్యాండ్స సర్వేశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. నలుగురు పిల్లలకు ఉద్యోగాలు రావడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకపోతున్నాయి. తాము పడిన కష్టాన్ని పిల్లలు గుర్తించి ప్రయోజకులయ్యారని వారు ఎంతగానో సంతోషిస్తున్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన పెంచాలి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: పంట సాగులో వచ్చే చీడపురుగులు, తెగుళ్ల నివారణపై రైతుల్లో అవగాహన పెంచాలని జిల్లా వ్యవసాయ శిక్షణ అధికారిణి సరళమ్మ తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం ఆవరణలో నంద్యాల డివిజన్‌లోని రైతు సేవా కేంద్రంలో పనిచేసే వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందికి నైపుణ్యాభివృద్ధిపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. పలు పంటల్లో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణపై ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, వెంకటరమణమ్మ, నంద్యాల ఏడీఏ రాజశేఖర్ తదితరులు వివరించారు. మట్టి పరీక్షలు తీసే విధానం, భూసార ఆధారిత ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. నంద్యాల, బనగానపల్లి వ్యవసాయ అధికారులు ప్రసాదరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణి

మిడుతూరు, న్యూస్‌టుడే: రబీలో రైతులు సాగు చేసే శనగ విత్తనాలను ప్రభుత్వం 25 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు కాతా మరేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారి పీరు నాయక్, సిబ్బంది రాము, అశోక్ తదితరులు పలువురు రైతులకు శనగ విత్తనాలను అందజేశారు. ఎకరాకు 40 కేజీల విత్తనం అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రైతులు మునాఫ్, ఇస్మాయిల్, గోవింద్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్యాలయంలో రాయితీ శనగ విత్తనాలు రైతులకు పంపిణి చేస్తున్న అధికారులు, తేదేపా నాయకులు.

విత్తనాలు, మందులు పంపిణీ

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కోళ్ళబావాపురానికి చెందిన గిరిజన రైతులకు శనగ విత్తనాలు, పిచికారి మందులు పంపిణీ చేశారు. స్థానిక ఆత్మ భవనంలో శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాలు, గిరిజన ఉప ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, నీలిమ, చైతన్య, ఏడీఏ విజయశేఖర్, నందికొట్కూరు ఏవో షేక్షావలి, కోళ్ళబావాపురం రైతులు పాల్గొన్నారు.

6న ఉద్యమ అధ్యయన తరగతులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 6న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో నిర్వహించే ఉద్యమ అధ్యయన తరగతులను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అధ్యయన తరగతుల్లో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల భానుమూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ పాల్గొంటారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ. శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు జాకీర్‌హుసేన్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, పుల్లయ్య, మధు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల న్యూస్‌టుడే : పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన అలివేలు మంగ, పద్మావతీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఈవో మద్దిలేటి, కమిటీ సభ్యులు ఈవీ సుజాతశర్మ, శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం స్వామి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి నిర్వహించి పూజలు చేశారు.

ఎంపీడీఓలుగా బాధ్యతల స్వీకరణ

శుక్రవారం పలు మండలాలకు నూతన ఎంపీడీఓలు బాధ్యతలు చేపట్టారు. అవుకు ఎంపీడీఓగా వెంగన్న, ప్యాపిలి ఎంపీడీఓగా ఏ.శ్రీనివాసరావు, సంజామల ఎంపీడీఓగా సల్మాన్, చాగలమర్రి ఎంపీడీవోగా మంజూలవాణి, రుద్రవరం ఎంపీడీఓగా భాగ్యలక్ష్మీ, కోవెలకుంట్ల ఎంపీడీఓగా వరప్రసాదరావు, ఈవోఆర్డీగా ప్రకాష్‌నాయుడు, శిరివెళ్ల ఎంపీడీఓగా శివమల్లేశ్వరప్ప బాధ్యతలు స్వీకరించారు.- న్యూస్‌టుడే బృందం

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ప్యాపిలి :
సమస్య : పట్టణంలోని బీసీ కాలనీలో డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారిలో మురుగు నీరు దుర్వాసన వస్తోంది.
– శ్వేత, కాలనీవాసి

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బంది చేత శుభ్రం చేయిస్తాం.– లక్ష్మిదేవి, సర్పంచి

సాగు భూములను చీల్చిన కుందూజలం



వరద జలాలు తగ్గుముఖం పట్టగా భూముల్లో నిలిచిన నీరు

కోవెలకుంట్ల న్యూస్‌టుడే : ప్రకృతి వైపరిత్యాలతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధిక వర్షాలతో వరదలు ముంచెత్తడంతో పాటుగా, మరికొన్ని సార్లు అనావృష్టితో వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో రైతులకు నష్టాలు సంభవిస్తున్నాయి. కానీ కోవెలకుంట్ల మండలంలో భారీ వర్షాల సమయంలో కుందూనది జలాలు పొంగి పొర్లడంతో ఆ నీరు పక్కనే ఉన్న సాగు భూముల్లోకి వస్తోంది. సుమారు పదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారని రైతులు వాపోతున్నారు.

నలభై రోజులుగా వరద జలాలు తరలిస్తున్నారు

వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద జలాలను కుందూనది ద్వారా నెల్లూరులోని సోమశిలకు తరలిస్తున్నారు. ఈ సమయంలో కుందూనది ఉద్ధృతంగా ప్రవహిస్తూ తీర ప్రాంతాల్లోని పంట భూములను ముంచెత్తుతుంది. ఇలా 40రోజుల పాటు వరద జలాలను తరలిస్తుండటంతో పంటలు, సాగు భూములు దెబ్బ తింటున్నాయి. కోవెలకుంట్ల మండలంలోని జోలదరాశి, కలుగొట్ల, ఎం.ఉప్పులూరు గ్రామాలు కుందూనది తీర గ్రామాలు కావడంతో ఈ ప్రాంత రైతులు అవస్థలు పడుతున్నారు. జోలదరాశి, కలుగొట్ల, ఎం.ఉప్పులూరు గ్రామాల్లో సుమారు 350ఎకరాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని నీరు పంటపొలాల్లోకి రాకుండా అడ్డుకట్టలు ఏర్పాటు చేయాలని కర్షకులు కోరుతున్నారు.

ఏటా రూ.14వేలు నష్టపోతున్నా..

చెన్నక్రిష్ణారెడ్డి, జోలదరాశి గ్రామం

నాకు సర్వే నెం.517లో ఒక ఎకరా పొలం ఉంది. 40రోజుల పాటు నిత్యం వరద జలాలను పారిస్తుండటంతో సాగు భూమిల్లోకి నీరు చేరడంతో సారవంతమైన నేల కొట్టుకుపోతుంది. రెండేళ్ల నుంచి ఈ నేలలో శనగ పంట వేస్తున్న కాపు రావడం లేదు. దీంతో ఏటా సుమారు రూ.14వేల దాకా నష్టపోతున్నాను.

పంట చేతికి రావడం లేదు..

సోముల వెంకటేశ్వరరెడ్డి, జోలదరాశి

నాకు కుందూనది వద్ద రెండు చోట్ల కలిపి 4ఎకరాల పొలం ఉంది. 40రోజుల పాటు వరద నీరు పొలంలో ప్రవహిస్తుండటంతో భూమి పూర్తిగా దెబ్బతింది. సేద్యం, విత్తనాలు, ఎరువులు కలిపి సుమారు రూ.5వేలు నష్టపోయాను. ఈ విధంగానే ఏటా శనగ, జొన్న, కంది పంటలను సాగుచేస్తున్న భూములు దెబ్బతిన్న కారణంగా ఏ పంట చేతికి రావడం లేదు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక న్యాక్ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్‌అండ్‌టి కన్‌స్ట్రక్షన్, హెటోరో, టీసీఎల్ కంపెనీల హెచ్‌ఆర్‌లు హాజరయ్యారు. జాబ్‌మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 55 మంది నిరుద్యోగులు హాజరవగా 26మందిని ఎంపిక చేసినట్లు ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ కెరీర్ సర్వీస్ ఇన్‌చార్జి చాంద్‌బాషా, నైపుణ్యాభివృద్ధి సంస్థ సమన్వయకర్తలు గోపీనాథ్, సీమ పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

ఏపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఏపీ ఉద్యోగుల సంఘం ఆళ్లగడ్డ యూనిట్‌కి సంబంధించిన ఎన్నికలు శుక్రవారం జరిగాయి. స్థానిక నీటి పారుదల కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ ఎన్నికలో ఏపీ ఉద్యోగుల ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడిగా జె.యోగేశ్వరయ్య, కార్యదర్శిగా అజరయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సుశీల, హుస్సేన్ బాషా, మహబూబ్ బాషా, శ్రీను నాయక్, హుస్సేన్ బాషా, నజీర్, సంయుక్త కార్యదర్శులుగా బి.మంజుల, లక్ష్మీ ప్రసన్న, సుబ్బమ్మ, శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు అధికారులుగా జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఫకృద్దీన్, పర్యవేక్షకులుగా జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, సహాయ కార్యదర్శి తిరుపాలయ్య వ్యవహరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రుద్రవరం న్యూస్‌టుడే : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విదాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళలకు సూచించారు. అనంతరం సీనియర్ లాయర్ రమాదేవి మాట్లాడుతూ మహిళలకు ఉచిత న్యాయ సహాయం ఉంటుందని ఏదైన సమస్య వచ్చినప్పుడు 1500కి కాల్ చేసి తమ ఫిర్యాదులను తెలపవచ్చునన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో తేజశ్వరి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు పుస్తకం, పెన్ను కలిగిన సంచిని అందజేస్తున్న జడ్జి

అందులను ప్రతి ఒక్కరు గౌరవించాలి

బనగానపల్లి న్యూస్‌టుడే : అందులను ప్రతి ఒక్కరు గౌరవించాల్సిన అవసరం ఉందని బనగానపల్లి మాజీ సర్పంచు బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 165 మంది అందులకు రూ.500 ప్రకారం రూ.82,500 నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా ప్రతి నెల సొంత నిధులతో అందులకు పింఛను అందజేస్తున్నామని చెప్పారు. అంతకు ముందు దివంగత బీసీ గుర్రెడ్డీ, లక్ష్మమ్మ, బీసీ సోదరుడు బీసీ బాలతిమ్మారెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బొబ్బల మహేశ్వరరెడ్డి, బలరామయ్య, బీసీ అభిమానులు పాల్గొన్నారు.



అందులకు పింఛన్లు అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

వన్యప్రాణుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

చాగలమర్రి న్యూస్‌టుడే : అటవీ ప్రాంతాల్లో ఉండే వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో శుక్రవారం వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఎస్పీజీ పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, వాటిని చంపితే విధించే శిక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు మదన్‌గోపాల్, సుభాష్ పాల్గొన్నారు.

అహోబిలంలో నవరాత్రి ఉత్సవాలు



హారతినిస్తున్న అర్చకులు

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం) న్యూస్‌టుడే : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. సాయంత్రం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి వేద ప్రబంధ పారాయణాలు పఠించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

వేలంలో రూ.30 లక్షలు ఆదాయం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో టెంకాయల దుకాణం నిర్వహణ, చిప్పల సేకరణకు శుక్రవారం వేలం పాటలు నిర్వహించారు. వంశీకృష్ణ అనే పాటాదారు రూ.30 లక్షలకు హక్కును దక్కించుకున్నారు.

టికెట్ల విక్రయ కేంద్రం మూసివేత

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే : బనగానపల్లి మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రవేశ టికెట్ల విక్రయ కేంద్రానికి పురావస్తుశాఖ అధికారులు శుక్రవారం తాళాలు వేశారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు నడుచుకుంటామని ఆలయాధికారి ప్రసాద్ తెలిపారు.

గుడ్డు తిని అస్వస్థతకు గురైన ఘటనపై విచారణ

స్పందనకు వందనం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-7 పరిధిలో ఉన్న విజయకుమారి ఈ నెల 1న కేంద్రం నుంచి కోడిగుడ్లు తీసుకెళ్లి తన నాలుగేళ్ల కూతురికి తినిపించగా ఆ చిన్నారి అస్వస్థతకు గురైంది. దీనిపై ఈనాడు నాలుగవ తేదీన 'అంగన్‌వాడీ గుడ్డు తిని చిన్నారికి అస్వస్థత' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. కథనానికి స్పందించిన సీడీపీవో ఉమామహేశ్వరి, కేంద్రాన్ని తనిఖీ చేసి బాధితుల ఇంటికి వెళ్లి విచారించారు. చిన్నారికి వాళ్ల పెదనాన్న బయట నుంచి బిర్యాని తెచ్చి తినిపించడం వల్ల వాంతులు అయినట్లు తమ విచారణలో తేలిందని సీడీపీవో తెలిపారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

బేతంచెర్ల : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఎం నాయకులు ఎల్లయ్య, వైబీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

డోన్, న్యూస్‌టుడే : ఉచిత ఇసుక అందిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఎం నాయకులు నక్కిశ్రీకాంత్, కోయిలకొండ నాగరాజులు అన్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో గురువారం తెల్లవారు జామున అనుమానంతో భార్య శివపార్వతిని, భర్త రామ్మోహన్ హత్య చేశారు. శుక్రవారం నిందితుడు రామ్మోహన్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

సంజామల : పేరుసోములలో మట్టిమిద్దె కూలడంతో బెల్లం పెద్ద పుల్లయ్యతో పాటు అతని కుమార్తె అర్చనకు గాయాలయ్యాయి.

అవుకు, న్యూస్‌టుడే : అవుకులోని ఈబీసీ కాలనీలో వెలసిన మజీదుపై గురువారం రాత్రి పిడుగు పడింది. దీంతో మజీదు గుమ్మం పాక్షికంగా దెబ్బతింది.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని స్థానిక పాతపేట జిల్లా పరిషత్ తాత్కాలిక ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే : కోడూరు పెద్ద పుల్లయ్య(66) మరణం సంజామల పట్టణంలో పార్టీకి తీరని లోటని బనగానపల్లి మాజీ సర్పంచి బీసీ రాజరెడ్డి, మంచాల మద్దిలేటిరెడ్డి, అన్నారు.

కోవెలకుంట్ల న్యూస్‌టుడే : వ్యవసాయంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు అన్నారు.

కోవెలకుంట్ల న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ మార్కెటు యార్డులో వ్యవసాయ సిబ్బందికి వ్యవసాయాధికారి ప్రభావతమ్మ ఆధ్వర్యంలో చీడ పురుగుల నివారణ చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు.

శిరివెళ్ల న్యూస్‌టుడే : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్సై చిన్నపీరయ్య యాదవ్ హెచ్చరించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే : చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఎంఈవో అనురాధ ప్రారంభించారు.

దొర్నిపాడు న్యూస్‌టుడే : సీజన్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి పేర్కొన్నారు.